# స్వేచ్ఛ నుంచి పంజరంలోకి



పరిమితులు లేని స్వేచ్ఛ ఓ అందమైన ఊహ. ఆ పరిమితులనే 'పంజరం' అనుకోవడం వట్టి అపోహ

ఉస్సురనుకుంటూ ఇంట్లో వచ్చిపడింది సుజాత. 'కాలేజీలో పిల్లలకు పాఠం చెప్పడం ఓ ఎత్తు, బస్సులో పడి ఇంటికి చేరడం ఓ ఎత్తు' అనుకుంటూ కుర్చీలో జేరబడి కళ్ళు మూసుకుంది.

"అదేమిటే అలా తోటకూర కాడలాగా వాడి పోయావు. నీ క్లాసులో ఓ ఇరవైమంది ఉంటారా? దానికేనా ఇలా ఆపసోపాలూ?" కాస్త సాగతీస్తూ సుజాత అత్తగారు కోడలి వరస చూసి అడిగారు.

"బస్సులో ఎప్పుడైనా ప్రయాణం చేశారా మీరు? అందులోనూ సాయంత్రం పూట. అత్తయ్యా అదో సాహస యాత్ర అనుకోండి. అబ్బబ్బ. శరీర హింస భరించవచ్చునేమోగాని ఈ మొగ కుర్రాళ్ళు అమ్మాయిలని హేళన చేస్తూ పాడే సినిమా పాటలూ, మాటలూ వినడం చాలా కష్టం. చాలా బాధాకరం కూడా. కొందరమ్మాయిలు మొగ్గల్లా ముడుచుకుపోయి ముళ్ళకంప చుట్టూ చుట్టుకున్నట్టు కనిపిస్తారు. కొందరు 'షటప్!' అనో, 'నోర్ముయ్' అనో కోపం ప్రదర్శించినా కుర్రకారుది గజచర్మం అయిపోయింది. ఇంకా రెచ్చిపోతారు. అబ్బ, రోజూ ఇదే తంతు. వాళ్ళకెందుకు వినుగెయ్యదో... అత్తయ్యా! నక్కు రాలేదా?" అడిగింది.

"అదెందుకింత తొందరగా వస్తుందే! అదేం స్నేహమో. ఆ రాజేశ్వరి పర్మిషన్ తీసుకుగాని బయలుదేరి రాదేమో." కాస్త కోపంగా అంటున్న అత్తగారిని నవ్వుతూ చూసింది సుజాత.

"అయినా సుజాతా! నువ్వు కాస్త కసరకపోతే అదింక మన మాట వినదు. ఇప్పటికే వినడం లేదనుకో" అంటూన్న అత్తగారితో మాట్లాడుతూనే వంటింటి కేసి నడిచింది సుజాత కాస్త కాఫీ తాగుదామని.

"చూడండి అత్తయ్యా. దాని చదువయింది. చక్కని సంబంధం చూసి పెళ్ళి చేసి పంపేస్తాం. ఇంక ఇలా ఒకచోట అంటిపెట్టుకుని మనం ఉండక్కర్లేదు. మీ అబ్బాయికి ఎక్కడ పోస్టింగ్ వస్తే అక్కడికి పోవచ్చు హాయిగా. 'నీ చదువు కోసం' అంటూ అన్నామనుకోండి 'అదిగో నాకోసం త్యాగాలు చెయ్యమనలేదు' అంటూ విరుచుకు పడుతుంది. ఈ కాలం పిల్లల పట్ల మనమే జాగ్రత్తగా ఉండాలి... చూద్దాం అది ఏమంటుందో." నెమ్మదిగా అత్తగారితో అంటూ ఉండగానే సుడిగాలిలాగా రానేవచ్చింది శకుంతల. "ఏమిటి మమ్మీ నాగురించి నావెనక చర్చించు కుంటున్నారా?" నవ్వుతూ అడిగి నానమ్మ ఇస్తున్న కాఫీ అందుకుంది శకుంతల.

"ఏం లేదే. పరీక్షలు రాసేశావా! ఇంకేముంది! మంచి పెళ్ళి కొడుకుని చూడాలని..." ఇంకా ఆమె మాట పూర్తికాకుండానే "వాట్! చదువయితే పెళ్ళి చేసుకోవాలా? మమ్మీ నేను పెళ్ళి చేసుకోను. ముందే చెప్తున్నా. తరువాత నేను విరుచుకు పడ్డానని అరిచి ప్రయోజనం లేదు. రాజేశ్వరీ, నేనూ కలిసీ ఈ నిర్ణయానికి వచ్చాం. వెధవ పెళ్ళి, వెధవ మగాళ్ళు! పెళ్ళంటే ఏముంది? తిండి, నిద్ర, బిడ్డాపాప, చాకిరీ...చాకిరీ... అంతేగా? మేం ఇద్దరం పెళ్ళి చేసుకోం. వ్యక్తుల్లాగా బతుకుతాం." గంబీరంగా అనేసి తన గదిలోకి వెళ్ళిపోయింది. శకుంతల.

అత్తాకోడలూ ముఖంముఖం చూసుకున్నారు కొన్ని క్షణాలు. తరువాత సుజాతే ముందుగా కోలుకుంది. "అత్తయ్యా మీరూరుకోండి. చూస్తాంగా" అంది.

"అయినా కూడా ఆ పిల్లతో స్నేహం నాకు నచ్చడం లేదే! అదేమిటి అలా ఇద్దరూ నడుం నడుం పట్టుకు తిరగడం? చూసేవాళ్ళేమనుకుంటారు? స్నేహితులు ఉండవలసిందే. మరీ ఇలా బరితెగించినట్టుంటే 'ఎవరు పెంచారో' అని నన్నూ, నిన్నే కదా లోకం అనేది. కాస్త ఆలోచించు. అలా పట్టించుకోకుండా ఉంటే..."

"పట్టించుకున్నట్టుంటే, మరీ వద్దన్న పనే చేసే వయసు. మరేం కంగారుపడకండి. చూద్దాం ఏం చేస్తుందో. సాయంత్రం అన్నమా, రొట్టెలా?" అడిగింది అత్తగారిని సుజాత.

"ఏదో ఒహటి. సుజాతా! మొన్న రెండు రోజులు నువ్వలా క్యాంప్ వెళ్ళినప్పుడాపిల్ల ఇక్కడే ఉంది. ఒట్టి మగరాయుడి బుద్ధులు. మన మీద ఇలా విరుచుకుపడుతుందా నక్కు. దానిదగ్గిర కుక్కిన పేనులా ఉండడం చూస్తే చాలా అసహ్యం వేసింది..." ఇంకా ఏదో చెప్పబోతున్న అత్తగారిని ఆపి, "రండి ఏదో కాస్త తినీ, టీవీలో సినిమా ఉందట చూద్దాం" అని మాట మార్చింది సుజాత.

కొద్ది నెలలుగా కూతురిలో వస్తున్న మార్పులు, మొండితనం గమనించక పోలేదు సుజాత. కానీ, చాలా సున్నితంగా చెప్పినా అపార్థం చేసుకునే వయసు. ఇప్పుడొస్తున్న ధోరణులకు నాయకత్వం వహించి, 'చాలా ముందుకి పోయింది' అని అందరూ తెలుసుకోవాలన్న తపన. కూడనిది, వద్దన్నది చేసి తీరాలన్న కసి. అదే తమ విజయం అన్న గర్వం శకుంతలని పట్టి ఆడిస్తూ ఉంది. భావనలో ఏకత్వం కలిగిన రాజేశ్వరి కూడా సుజాతకి తెలుసు. "ఛ ఆడతనం, మగతనం కాదు మనం గుర్తించవలసింది, వ్యక్తిత్వం ఆంటీ. ఈ విషయాల్లో నేనూ, నక్కూ ఒకటి. చూడండి ఓ రోజు మీకు మేం నిరూపిస్తాం" అంది ఒకసారి రాజేశ్వరి.

"ఏం నిరూపిస్తారు?" కుతూహలంగా అడిగింది సుజాత.

"మేం రైట్ అని. నాకు ఉద్యోగం రెడీ. నక్కుకి కూడా వచ్చేస్తుంది" అంది గర్వంగా.

"ఆర్థికంగా సొంత కాళ్ళమీద నిలబడడం మంచిదే రాజీ, అది ధైర్యాన్నిస్తుంది" అంది సుజాత.

"అంతే కాదాంటీ. అది మా ఇష్టం వచ్చినట్టు మమ్మల్ని ఉండనిస్తుంది. ఈ సమాజం ముఖం మీద ఒక్క తన్ను తన్ని, జాతికి చూపిస్తాం" చాలా గర్వంగా అంది.

"అంటే, నువ్వు పెళ్ళి చేసుకోవా?"

"ఛ...ఛ... కోరి బానిసత్వం కొనుక్కుంటారా ఎవరైనా? ఇద్దరూ స్వేచ్ఛాజీవులుగా బతకవచ్చు" అంది.

ఒకసారి అంతకుముందే కూతురూ, రాజేశ్వరీ చాలా మురిసిపోయి, పొంగిపోయి, ఉత్తేజపడిపోయి ఫైర్ అనే ఓ సినిమా గురించి తనని ఊదర గొట్టడం జ్ఞాపకానికి వచ్చింది సుజాతకి. మనసు కాస్త భారమైంది కూడా. వీళ్ళెటుపోతున్నారు? ఏం ఆలోచిస్తున్నారు అనుకుంది. వీరి స్పందనకి అర్థంఏమిటి? అంతం ఏమిటి? అనుకుంది.

*  *  *

"మమ్మీ ఉద్యోగం వచ్చింది. నేనూ, రాజీ ఓ ఫ్లాట్ తీసుకుంటాం. స్వతంత్ర జీవితం ప్రారంభిస్తాం" అంది చాలా గర్వంగా, చాలా ఆనందంగా నక్కు.

"నాన్నగారికి చెప్పవా?"

పెద్ద జోక్ విన్నట్టు నవ్వి "నేనేం పాపాయినా" అంది.

"కాదు. అందుకే బాధ్యత తెలియాలి అని నా ఉద్దేశం" అంది నెమ్మదిగానే సుజాత.

"చూడు మమ్మీ. బాధ్యత, సంప్రదాయం... ఏమనుకుంటారు? ఇలాంటివి చెప్పకు. నువ్వు చదువుకుని ఉద్యోగం చేస్తూ కూడా పెళ్ళి సంసారం, సంప్రదాయం, సమాజం అంటూ ఊబిలో కూరుకుపోయావు. నిన్నెవరూ రక్షించలేరు మమ్మీ" అంది జాలిగా.

"మరి రాజేశ్వరి?"

"అదిప్పుడింట్లో లేదు. దానికి ఇంట్లో ఊపిరాడదు."

"చూడు సుజా, దానితో వాదనేంటి? అబ్బాయిని పిలిపించు" అంది అత్తగారు.

"నానమ్మా, నాన్న వచ్చి నా కాళ్ళూ చేతులూ కట్టేసి పడేస్తారా." వేళాకోళంగా అడిగింది.

"లేదే, పిచ్చి ముదిరిపోకుండా పిచ్చాస్పత్రిలో ఓ ఆర్నెల్లు పడేస్తాడని... ఏమిటా వాగుడు? ఆ ఉద్యోగం ఇంటినుంచి వెళ్ళి ఏడవలేవా?" ఆవేశంగా, కోపంగా అరిచారు పెద్దావిడ.

"ఊరుకోండత్తయ్యా. ఎందుకంత కోపం? దాన్ని ఆ స్వేచ్ఛ అనుభవించనివ్వండి. మనం అడ్డుకోవడం దేనికి" అని అత్తగారితో అని, "ఎప్పుడు వెళదామని" అని అడిగింది సుజాత.

"ఈ వీకెండే. కడిగి శుభ్రం చేస్తా" అంది నక్కు.

"అదేం రాజేశ్వరి?" కుతూహలంగా అడిగింది సుజాత.

"దానికి ఓవర్‌టైమ్ ఉంది." ముభావంగా చెప్పేసి తన గదిలోకి వెళ్ళిపోయింది శకుంతల.

ఇన్నాళ్ళూ కనబడని రెక్కలు విస్తరించినట్లు, తాను గాలిలో తేలిపోతూ స్వేచ్ఛాజీవనానికి ప్రయాణం అవుతున్నట్లు, ఆ ఆనందం పట్టలేక కళ్ళు వర్షిస్తున్నట్లు అనిపించింది శకుంతలకి. "అబ్బ! ఇష్టమైనట్లు బతకాలనుకోవడంలో ఇంత ఆనందముంటుందా" అని పదే పదే అనుకోసాగింది.

*  *  *

శకుంతల వెళ్ళి మూడు నెలలకు పైగా అయింది. సుజాత ప్రాణం పీకుతోంది, ఓసారి కూతుర్ని చూడాలని. కానీ, నిగ్రహించుకుంది. ముసలావిడకి ఇదంతా బాధగా ఉంది. "అందరూ వెళుతున్నారు. నన్నూ తీర్థయాత్రలకు పంపవే కాస్త మనసు స్థిమితపడుతుంది, ఈ పిల్ల చేసిన పాడుపనికి. పెళ్ళి చేసి అత్తారింటికి పంపవలసిన పిల్ల. పోనీ ఈ

ఉద్యోగం పై ఊళ్ళో ఏడవకూడదూ? పదిమందికీ సమాధానం చెప్పుకోవలసిన బాధ లేకుండా ఉండేది?" కళ్ళొత్తుకుంటూ అంది ఆవిడ.

అత్తగారిని ఓదార్చడం ఎలాగో అర్థం కాలేదు సుజాతకి. "తీర్థయాత్రలు చేసిరండి. సక్కు మీరొచ్చేసరికి ఇంట్లో ఉంటుందేమో" అంటూ నచ్చి ఆమెకి ప్రయాణం ఏర్పాట్లు చేసింది సుజాత. భర్తకి ఉత్తరం రాసింది. "పోనీవే, దాని ధోరణిలో దాన్ని పోనీ. తప్పుని తిరిగి వస్తేమటుకు వెనక్కి పంపకు. సాధారణంగా ఆవేశంతో పెద్దలం చేసే తప్పే అది" అని ధైర్యం చెప్తూ ఉత్తరం రాశాడు.

శకుంతల శకుంతలలాగే నాజూకైనది. బట్టలు ఉతకడం, అంట్లు తోమడం, ఇల్లు అద్దంలా ఉంచి ఆఫీసుకి బయలుదేరడం కష్టం అనిపించసాగింది. "నువ్వూ షేర్ చెయ్యి రాజీ" అంటే, గట్టిగా వాటే

> "మమ్మీ ఉద్యోగం వచ్చింది. నేనూ, రాజీ ఓ ఫ్లాట్ తీసుకుంటాం. స్వతంత్ర జీవితం ప్రారంభిస్తాం" అంది చాలా గర్వంగా, చాలా ఆనందంగా సక్కు.

నుకుని, ఓ ముద్దు పెట్టి, "ఇదే నా షేర్. నా పని ఒత్తిడి నీకు తెలుసు?" అని నవ్వేసి పోయి పడుకుంటుంది. రాత్రీ పగలూ- సెలవులన్నీ ఒక్కలాగే జరిగిపోతున్నాయి శకుంతలకి.

"రావే సాక్స్!" ముద్దుగా పిలిచి గట్టిగా కౌగిలించుకొని పడుకొనే రాజేశ్వరిని కాదనలేక, తనకు గగనమైపోతున్న స్వేచ్ఛని వదులుకోలేక, ఎలా చెప్పాలో తెలియక అలగడం ప్రారంభించింది శకుంతల.

"ఇంటిపనీ, ఉద్యోగం కష్టంగా ఉందా సక్కూ! పోనీ ఉద్యోగం మానెయ్. నా సంపాదన హాయిగా మనకి సరిపోతుంది" అంది ఓరోజు రాజేశ్వరి.

పక్కనే పిడుగుపడ్డట్టు ఉలిక్కిపడింది శకుంతల. "ఎందుకంత భయం? నిన్ను పోషించలేనా? నిన్ను ఆనందంగా ఉంచలేనా? జీతం రోజున నీకు

చిత్రాలు:నర్సిం





> "స్త్రీపురుషులు పెళ్ళి చేసుకున్నంత మాత్రాన, కనబడని తాళ్ళు వాళ్ళని కట్టిపడేశాయనుకోవడం పొరపాటు నక్కూ! అంతకంటే ఉన్నతమైనవీ, సున్నితమైనవీ వారిని కట్టి ఉంచుతాయి."

చక్కని డ్రస్ తెస్తున్నానా లేదా? ఇంకేం కావాలే నక్కూ నీకు?" దగ్గరగా తీసుకుంటూ అడిగింది రాజేశ్వరి.

"అంటే నేను సాదా సీదా గృహిణిగా వంటా వార్పూ చేస్తూ, నీ రాక కోసం అలంకరించుకొని నీకు పెళ్ళాంలాగా ఉండిపోమనా? నాన్సెన్స్. 'నువ్వూ, నేనూ సమం' అని కదా మనం బతకదల్చింది. నా సాంగత్యం సరే, నీ సహకారం ఏదీ? ఇప్పుడు నా ఆర్థిక స్వాతంత్ర్యానికే నామం పెట్టాలని చూస్తున్నావే." వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ అంది శకుంతల. క్షణంపాటు నివ్వెరపడినా, "సారీ సాక్స్, నేను అలా అనుకోలేదు. కానీ, ఎవరికో ఒకరం లొంగి ఉండక తప్పదేమో. ఆనందం పంచుకోవాలంటే, అలక్ష్యం చేయడం కంటే, అన్నీ అందించి సహకరించడం కావాలికదా! నువ్వు..."

రాజేశ్వరి మాట పూర్తి కాకుండానే చేతిలో గ్లాసు ఆమె మీదికి విసిరింది శకుంతల. అంతే రాజేశ్వరి శకుంతల చెంపలు వాయించింది. ఒక్క క్షణం ముద్దులతో ముంచెత్తి ఆనందించింది శకుంతల విదిలించుకుంది. "నే పెందరాడే వస్తాలే, మాట్లాడుకుందాం" అంటూ వెళ్ళిపోయింది రాజేశ్వరి. ఆమె సాయంత్రం తిరిగి వచ్చేదాకా శకుంతల ఆగలేదు. పెట్టె సర్దుకుని ఆటోలో ఇంటికి చక్కా వచ్చింది.

ఏదీ కాని టైములో కాలింగ్ బెల్ మోగడంతో, కాస్త జ్వరంగా ఉన్న సుజాత లేచి వచ్చి తలుపు తీసి కూతుర్ని చూసి బిక్కముఖం వేసింది. "రావచ్చా మమ్మీ?" ఏడుస్తూ అడిగింది. "ఇది నీ ఇల్లు. అలా అడుగుతావేం! రా. ఇష్టముంటే చెప్పు ఏమైందని. లేకుంటే ఊరుకో, రా" అంది సుజాత. చాలాసేపు తల్లి కౌగిట ఇమిడిపోయి ఏడ్చింది. ముఖం తుడుచుకొని "మమ్మీ, 'ఇల్లు' పంజరం, సమాజాన్ని ధిక్కరించి పంజరం చీల్చుకు బయట పడితే, ఆనందమే ఆనందం, సంతోషమే సంతోషం' అంది రాజేశ్వరి. కానీ, అదేంకాదు మమ్మీ. అదేం కానే కాదు. మా స్నేహం చెడింది. నన్నో బానిసగా చేసేసింది మమ్మీ. నేను భరించలేను."

ఏడుస్తూనే అంటున్న కూతుర్ని ఓదార్చి, "సమాజం, సంప్రదాయం, పెళ్ళి, బాంధవ్యాలు ఇవన్నీ నీమీద కసితో పెట్టిన ఆంక్షలు కావు నక్కూ! నీ రక్షణ కోసమే ఏర్పడ్డ కనపడని పంజరాలే. కానీ, అవి నిన్నేం బంధించి పడేయవే! వివాహ వ్యవస్థలో లోపాలుంటే నువ్వు వాటిని సర్దుకోవచ్చు. భరించలేకపోతే తెగతెంపులు చేసుకోవచ్చు. సమాజం ఎవరు? మనకు మనమే కదా! నువ్వెవ్వరికీ జవాబు చెప్పక్కర్లేదు. నీ కష్టం నువ్వు పరిష్కరించుకోగలవు. ఎందుకో తెలుసా? ఇవన్నీ తెరచి ఉన్న పంజరాలు. ఇంతకంటే స్వేచ్ఛ నీకు ఎక్కడ దొరుకుతుంది? పిచ్చి దానా! నేనూ, మీనాన్న అరుచుకోవడం వినలేదా? నా ఒంట్లో బాగులేకపోతే నన్ను మోసుకెళ్ళి బాత్‌రూమ్‌కి సైతం తీసుకెళ్ళలేదా? స్త్రీపురుషులు పెళ్ళి చేసుకున్నంతమాత్రాన, కనబడని తాళ్ళు వాళ్ళని కట్టిపడేశాయనుకోవడం పొరపాటు నక్కూ! అంతకంటే ఉన్నతమైనవీ, సున్నితమైనవీ వారిని కట్టి ఉంచుతాయి. ప్రకృతి విరుద్ధమైన చేష్టలు ఎవరు పట్టించుకోకపోయినా, తప్పని పిస్తాయి. ఇందుకే నీకు తెలియదు. ఫైర్ సినిమా అది. ఇద్దరాడాళ్ళు ఎప్పటికీ దంపతులని పించుకోరన్నది, దానిలో వాళ్ళిద్దరూ బయటికి వెళ్ళాక కదా తెలిసేది? ఒకవేళ అలా బతకాలనుకున్నా అదెన్నాళ్ళు సాగుతుంది?

పెళ్ళి అంటే సెక్సు ఒక్కటే కాదు, కలిసి ఒకళ్ళ కోసం ఒకళ్ళు బతకడం. ఏరోజుకారోజు కొత్తగా బతకడం. తెలుసా? ఏడవకు."

శకుంతల తల్లి ముఖంలోకి తీక్షణంగా క్షణం పాటు చూసింది. ఆమె పెదవులు నవ్వనా వద్దా అన్నట్లు కొంచెంగా విచ్చుకున్నాయి.

తల్లినొక్కసారి గట్టిగా కౌగలించుకుంటూ, "నానమ్మా" అని కేకేసింది. "వస్తారు రేపు. ఒకటీ రెండూ కాదు. మూడు నెలలు తీర్థయాత్రలు." నవ్వింది సుజాత.

"నామీద కోపంతోనే?" బాధగా అడిగింది శకుంతల.

"లేదు. నువ్వు తిరిగి రావాలన్న కోరికతో. పద కాఫీ తాగుదాం" అంటూ వంటింట్లోకి దారితీసింది సుజాత. ఉప్పెనలా ముంచెత్తుతుందన్న భయం, తుపాను కంటే తక్కువగా సమసిపోవడం ఆమెకి సంతోషం కలిగించింది. "ఇదే కాబోలు 'కాలమే చెప్తుంది' అన్నదాని అర్థం" అనుకుంది సుజాత. ■